బోణీ కొట్టాలని

నేడు ఉప్పల్‌లో హైదరాబాద్, ముంబై మ్యాచ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐపీఎల్ మన నగరానికి వచ్చేసింది. లీగ్ మొదలైన ఐదు రోజుల తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత ఇలాఖాలో తొలి పోరుకు సిద్ధమైంది. బుధవారం ఉప్పల్ స్టేడియం వేదికగా హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య పోరు జరుగనుంది. ఇప్పటి వరకూ ఏడు మ్యాచ్‌లు జరిగిన ఈ సీజన్‌లో హోంగ్రౌండ్‌లో మ్యాచ్ ఆడిన ఏ జట్టూ ఓడిపోలేదు. ఉప్పల్ స్టేడియంలో స్థానిక పరిస్థితులను ఎస్‌ఆర్‌హెచ్ ఏ మేరకు వినియోగించుకుంటుందో చూడాలి. ఆస్ట్రేలియాకు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించిన కమిన్స్‌ను వేలంలో భారీ ధరకు కొనుగోలు చేసిన ఎస్‌ఆర్‌హెచ్.. అతడిపై భారీ అంచనాలే పెట్టుకుంది. సొంత అభిమానుల మద్దతు సంపూర్ణంగా ఉన్న హైదరాబాద్.. తొలి మ్యాచ్‌లో కేకేఆర్ చేతిలో విజయానికి దగ్గరగా వచ్చినా ఆఖర్లో తడబడి ఓటమి వైపున నిలిచింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ, ఎయిడెన్ మార్క్‌రమ్, ట్రావిస్ హెడ్, రాహుల్ త్రిపాఠి, గ్లెన్ ఫిలిప్స్, హెన్రిచ్ క్లాసెన్ వంటి హిట్టర్లు పుష్కలంగా ఉన్న ఎస్‌ఆర్‌హెచ్‌ను ఏ మేరకు ఆదుకుంటారో మరి.. బౌలింగ్‌లో కమిన్స్, భువనేశ్వర్ కుమార్, మయాంక్ మార్కండే కీలకం. మరోవైపు తొలి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓడిన ముంబై బుధవారం పోరులో హైదరాబాద్‌కు షాకివ్వాలని చూస్తున్నది.

పెర్త్‌లో తొలి టెస్టు.. అడిలైడ్‌లో గులాబీ పోరు

భారత్, ఆసీస్ టెస్టు సిరీస్ షెడ్యూల్ విడుదల

సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో ఈ ఏడాది నుంచి ఐదు టెస్టులు ఉంటాయని ఇప్పటికే ప్రకటించిన క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తాజాగా ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌నూ వెల్లడించింది. ఈ ఏడాది నవంబర్ 22 నుంచి మొదలయ్యే ఈ ప్రతిష్ఠాత్మక సిరీస్ జనవరి 7 దాకా కొనసాగనుంది. తొలి టెస్టుకు పెర్త్ ఆతిథ్యమివ్వనుండగా 2020-21లో భారత్ 36 పరుగులకే ఆలౌట్ అయిన అడిలైడ్‌లో గులాబీ బంతితో డే అండ్ నైట్ టెస్టు జరుగనుంది. గబ్బా, మెల్‌బోర్న్ (బాక్సింగ్ డే టెస్టు), సిడ్నీలో తర్వాత మ్యాచ్‌లు జరుగుతాయని సీఏ ప్రకటించింది. ఈ సిరీస్‌తో పాటు ఇంగ్లండ్‌తో ఉమెన్స్ యాషెస్, పాకిస్థాన్‌తో పరిమిత ఓవర్ల షెడ్యూల్‌నూ సీఏ వెల్లడించింది. కాగా 2017 నుంచి భారత్.. వరుసగా నాలుగు సార్లు బీజీటీని నిలబెట్టుకుంటోంది. ఆస్ట్రేలియాలో 2019-20, 2021-2022లో టీమ్‌ఇండియాదే విజయం. ఈ ఏడాదీ గెలిస్తే భారత్ హ్యాట్రిక్ కొట్టనుంది.

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25 షెడ్యూల్

తొలి టెస్టు	నవంబర్ 22 - 26	పెర్త్
రెండో టెస్టు	డిసెంబర్ 6-10	అడిలైడ్ (డే అండ్ నైట్)
మూడో టెస్టు	డిసెంబర్ 14-18	గబ్బా
నాలుగో టెస్టు	డిసెంబర్ 26-30	మెల్‌బోర్న్
ఐదో టెస్టు	2025 జనవరి 3-7	సిడ్నీ

మహిళల ఆసియా కప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: ఈ ఏడాది మహిళల ఆసియా కప్ (టీ20)కు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. జూలై 19 నుంచి 28 వరకూ జరగాల్సి ఉన్న ఈ టోర్నీలో 8 దేశాలు పాల్గొననున్నాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించగా డిఫెండింగ్ చాంపియన్ భారత్.. యూఏఈ, నేపాల్, పాకిస్థాన్‌లతో కలిసి గ్రూప్-ఏలో ఉంది. బంగ్లాదేశ్, శ్రీలంక, మలేషియా, థాయ్‌లాండ్ గ్రూప్-బీలో ఉన్నాయి. జూలై 19 నుంచి 21 దాకా లీగ్ దశ మ్యాచ్‌లు ఉండగా 26న సెమీస్, 28న ఫైనల్ నిర్వహించనున్నట్టు ఆసియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది.

షకీబ్‌కు పిలుపు

ఢాకా: స్వదేశంలో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ఆడుతున్న బంగ్లాదేశ్.. సోమవారం ముగిసిన తొలి టెస్టులో 328 పరుగుల తేడాతో ఓడటంతో రెండో టెస్టులో దీటుగా బదులివ్వాలని భావిస్తున్నది. ఈ క్రమంలో ఆ జట్టు శనివారం నుంచి చట్టోగ్రామ్ వేదికగా మొదలయ్యే రెండో టెస్టుకు స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ ను జట్టులో చేర్చింది.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

మియామి: యూఎస్‌లో జరుగుతున్న మియామి ఓపెన్‌లో రోహన్ బోపన్న జోరు కొనసాగిస్తున్నాడు. మంగళవారం జరిగిన పురుషుల ప్రిక్వార్టర్స్‌లో బోపన్న, మాథ్యూ ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జోడీ 7-5, 7-6(3) తేడాతో హ్యూగో నైస్, జన్ జిలెన్‌స్కీ ద్వయంపై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. మరోవైపు మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ 4-6, 2-6 తేడాతో 14వ సీడ్ అలెగ్జాండ్రోవా చేతిలో ఓడింది.

భారత్‌కు షాక్

ఆఫ్గనిస్థాన్ చేతిలో ఓటమి

గువాహటి: ఫిఫా ప్రపంచకప్(2026) క్వాలిఫయింగ్ మూడో రౌండ్‌కు అర్హత సాధించే అవకాశాన్ని భారత్ మరింత క్లిష్టం చేసుకుంది. మంగళవారం గువాహటి ఇందిరా గాంధీ స్టేడియం వేదికగా జరిగిన కీలక పోరులో భారత్.. 1-2 తేడాతో ఆఫ్ఘనిస్థాన్ చేతిలో పరాజయం పాలైంది. తన కెరీర్‌లో 150వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన కెప్టెన్ సునీల్ ఛెత్రీ.. 38వ నిమిషంలో గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలోకి తెచ్చాడు. ప్రథమార్ధం పూర్తయ్యేసరికి బ్లూ టైగర్స్ 1-0తో ఆధిక్యంలోనే ఉన్నారు. కానీ కీలకమైన ద్వితీయార్ధం మొదలయ్యాక 70వ నిమిషంలో రహ్మత్ అక్బరీ గోల్ చేయడంతో స్కోర్లు సమమయ్యాయి. మ్యాచ్ మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనగా గుర్‌ప్రీత్ సింగ్‌కు రిఫరీ ఎల్లో కార్డ్ చూపించడంతో అఫ్గాన్‌కు పెనాల్టీ లభించింది. 88వ నిమిషంలో షరీఫ్ ముఖమ్మద్ గోల్ చేసి అఫ్గనిస్థాన్‌ను 2-1 ఆధిక్యంలోకి తేవడంతో పాటు విజయాన్ని అందించాడు. జూన్‌లో కువైట్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది.

ముందు దంచి.. ఆపై కూల్చి..

చెపాక్‌లో సీఎస్‌కే రెండో విజయం ● దూబే, రచిన్ వీరవిహారం

ఛేదనలో చేతులెత్తేసిన గుజరాత్

ఐపీఎల్-17లో డిఫెండింగ్ చాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ రెండో విజయాన్ని నమోదుచేసింది. సొంత మైదానం చెపాక్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ఆడిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముందు బ్యాటింగ్‌లో రచిన్, దూబే, రుతురాజ్ దంచికొట్టారు. ఆ తర్వాత భారీ ఛేదనలో గుజరాత్‌ను సీఎస్‌కే స్టార్ పేసర్ దీపక్ చాహర్ ఆదిలోనే దెబ్బతీసి కోలుకోనీయకుండా చేయగా తుషార్, మిచెల్, ముస్తాఫిజుర్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సాయి సుదర్శన్ ఒంటరి పోరాటం చేసినా అతడికి అండగా నిలిచే వాళ్లు లేకపోవడంతో గుజరాత్‌పై చెన్నైదే పైచేయి అయింది.

దూబే (51)

చెన్నై : ఐపీఎల్‌లో ఆరో ట్రోఫీ వేటలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. సొంత ఇలాఖాలో తమకు తిరుగులేదని నిరూపిస్తూ గుజరాత్ టైటాన్స్‌ను 63 పరుగుల తేడాతో చిత్తుచేసింది. చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియం వేదికగా ముగిసిన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీ స్కోరు చేసింది. సిక్సర్ల స్పెషలిస్టు శివమ్ దూబే (23 బంతుల్లో 51, 2 ఫోర్లు, 5 సిక్సర్లు), రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 46, 6 ఫోర్లు, 3 సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (36 బంతుల్లో 46, 5 ఫోర్లు, 1 సిక్స్) లు చెన్నై భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించారు. భారీ ఛేదనలో గుజరాత్ టైటాన్స్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో పాటు భాగస్వామ్యాలు నిర్మించడంలో విఫలమై ఓటమిని మూటగట్టుకోవాల్సి వచ్చింది. 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్లు కోల్పోయి 143 పరుగుల వద్దే ఆగిపోయింది. సాయి సుదర్శన్ (31 బంతుల్లో 37, 3 ఫోర్లు) టాప్ స్కోరర్. చెన్నై బౌలర్లలో చాహర్, తుషార్, ముస్తాఫిజుర్ లు తలా రెండు వికెట్లు పడగొట్టి గుజరాత్ ఓటమిని శాసించారు.

దూబే ధూమ్..

రహానే (12)ను సాహ స్టంపౌట్ చేయడంతో క్రీజులోకి వచ్చిన తొలి రెండు బంతుల్లోనే భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. గిల్ స్పిన్నర్‌కు బంతినివ్వడమే పాపం అన్నంతగా సాయికిషోర్, రషీద్‌ను లక్ష్యంగా చేసుకుని వీర విహారం చేశాడు. ఎడాపెడా బాదిన దూబే.. 22 బంతుల్లోనే అర్ధ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. మరో ఎండ్‌లో డారిల్ మిచెల్ (24) అతడికి పూర్తి సహకారం అందించాడు. ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాక దూబే ఔట్ అయినా యూపీ కుర్రాడు సమీర్ రిజ్వీ ఎదుర్కొన్న తొలి బంతితో పాటు మొదటి నాలుగు బంతుల్లోనే రెండు భారీ సిక్సర్లు బాదడంతో సీఎస్‌కే భారీ స్కోరు సాధించింది.

ఒడిదొడుకుల నడుమ..

కొండంత లక్ష్యాన్ని కరిగించే క్రమంలో గుజరాత్‌కు ఆది నుంచే కష్టాలు చుట్టుముట్టాయి. దీపక్ చాహర్ వరుస ఓవర్లలో గుజరాత్‌కు డబుల్ షాకులిచ్చాడు. మూడో ఓవర్లో గిల్ (8)ను లెగ్ బిఫోర్‌గా ఔట్ చేసిన అతడే.. మరుసటి ఓవర్లో సాహ (21)ను పెవిలియన్‌కు పంపాడు. 8వ ఓవర్లో విజయ్ శంకర్ (12) ఇచ్చిన క్యాచ్‌ను ధోనీ ముందుకు డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. సాయి సుదర్శన్ ఆదుకునే యత్నం చేసినా అతడికి మిగిలిన బ్యాటర్లు తోడ్పాటునందించలేదు. 16 బంతుల్లోనే మూడు ఫోర్ల సాయంతో 21 రన్స్ చేసిన డేవిడ్ మిల్లర్..తుషార్ వేసిన 12వ ఓవర్లో అజింక్యా రహానే సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. సుదర్శన్‌ను పతిరాన పెవిలియన్‌కు పంపాడు. 11-15 ఓవర్ల మధ్య గుజరాత్ 34 పరుగులు మాత్రమే చేసి 2 వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టు ఛేదించాల్సిన రన్ రేట్ భారీగా పెరిగిపోయింది.

రచిన్.. దంచెన్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన చెన్నైకి రచిన్ రవీంద్ర అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఉమేశ్ యాదవ్ వేసిన రెండో ఓవర్లోనే సిక్స్, ఫోర్‌తో బాదుడు ఆరంభించిన అతడు.. అజ్మతుల్లా వేసిన మరుసటి ఓవర్లోనూ బ్యాక్ టు బ్యాక్ ఫోర్లతో ఆకట్టుకున్నాడు. నాలుగో ఓవర్లో 6, 4, 6తో ఆధిక్యాన్ని ప్రదర్శించాడు. రచిన్ బాదుడుతో చెన్నై 4.3 ఓవర్లలోనే 50 పరుగుల మార్కును దాటింది. దూకుడుగా ఆడుతున్న రచిన్.. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. రచిన్ ఔట్ అయినా బాదుడు బాధ్యతలను రుతురాజ్ తీసుకున్నాడు. ఈ లీగ్‌లో గుజరాత్‌పై గత ఐదు మ్యాచ్‌లలో నాలుగు అర్ధ సెంచరీలు సాధించిన గైక్వాడ్.. స్పెన్సర్ జాన్సన్ వేసిన పదో ఓవర్లో 6, 4 బాదాడు. కానీ అర్ధ సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

రచిన్‌రవీంద్ర (46)

1 పరుగుల(63) పరంగా గుజరాత్ టైటాన్స్‌కు ఇది తొలి భారీ ఓటమి. గతంలో ముంబైపై (27), చెన్నైపై (15) గుజరాత్ ఓటములు ఎదుర్కొంది.

సంక్షిప్త స్కోర్లు

చెన్నై : 20 ఓవర్లలో 206/6 (దూబే 51, రవీంద్ర 46, రుతురాజ్ 46, రషీద్ ఖాన్ 2/49) గుజరాత్ : 20 ఓవర్లలో 143/8 (సాయి 37, మిల్లర్ 21, చాహర్ 2/28, ముస్తాఫిజుర్ 2/30, తుషార్ 2/21)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
చెన్నై	2	2	0	1.97	4
రాజస్థాన్	1	1	0	1.00	2
కోల్‌కతా	1	1	0	0.20	2
పంజాబ్	2	1	1	0.02	2
బెంగళూరు	2	1	1	-0.18	2
గుజరాత్	2	1	1	-1.42	2
హైదరాబాద్	1	0	1	-0.20	0
ముంబై	1	0	1	-0.30	0
ఢిల్లీ	1	0	1	-0.45	0
లక్నో	1	0	1	-1.00	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

వాణిజ్య

సోనాలిక కొత్త ట్రాక్టర్

ధర రూ.8,49,999

న్యూఢిల్లీ, మార్చి 26: ట్రాక్టర్ల తయారీలో అగ్రగామి సంస్థలో ఒకటైన సోనాలిక సరికొత్త నిర్ణయం తీసుకున్నది. 'వన్ నేషన్..వన్ ట్రాక్టర్ ధర' అనే నినాదంతో దేశీయ ట్రాక్టర్ ఇండస్ట్రీలో వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నయా ట్రాక్టర్ సికందర్ డీఎల్ఎక్స్ డీఐ 60 మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 4709 సీసీ శక్తివంతమైన ఇంజిన్‌తో తయారైన ఈ ట్రాక్టర్‌లో 12ఎఫ్+12ఆర్ గేర్లు, అడ్వాన్స్ 5జీ హైడ్రాలిక్‌తోపాటు 10 డీలక్స్ ఫీచర్స్‌తో రూపొందించింది. దేశవ్యాప్తంగా ఈ ట్రాక్టర్ రూ.8,49,999కే లభించనున్నది.

మహీంద్రా వర్సిటీకి 500 కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 26: హైదరాబాద్ కేంద్రంగా విద్యా సేవలు అందిస్తున్న మహీంద్రా యూనివర్సిటీలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, ఆయన కుటుంబ సభ్యులు రూ.500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఐదేండ్ల వరకు 2024-25 నుంచి 2028-29 వరకు ఈ పెట్టుబడులు పెట్టనున్నారు. వీటితోపాటు మహీంద్రా గ్రూపు చైర్మన్ ప్రత్యేకంగా రూ.50 కోట్లు మహీంద్రా యూనివర్సిటీకి అనుబంధ సంస్థయైన ఇందిరా మహీంద్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించారు.

ఇండోసోల్ సోలార్ మాడ్యుల్ ఉత్పత్తి

హైదరాబాద్, మార్చి 26:శిర్డి సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థయైన ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్..ఆంధ్రప్రదేశ్‌లో సోలార్ మాడ్యుల్ తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను 30 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసినట్లు కంపెనీ సీఈవో శరత్ చంద్ర తెలిపారు.

నాన్సెన్స్.. అదంతా ఉత్తదే!

- 2047కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశం కాలేదు
- ప్రస్తుత ఆర్థికవృద్ధి ప్రచారమంతా పెద్ద బూటకం
- వృద్ధిని ఎక్కువ చేసి చూపిస్తున్నారు.. దీంతో నష్టమే
- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కీలక వ్యాఖ్యలు
- విద్య, ఉద్యోగాల్లో నైపుణ్యాభివృద్ధి ముఖ్యమని వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): '2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెడతాం' అంటూ ఊదరగొడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యలన్నీ అబద్ధాలేనని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కుండబద్దలు కొట్టారు. ఇలాంటి వాగ్దానాలపై మాట్లాడటం కూడా అర్థంలేని చర్య (నాన్సెన్స్ టు టాక్)గా అభివర్ణించారు. దేశ ప్రస్తుత ఆర్థికవృద్ధిరేటును కావాలనే ఎక్కువ చేసి చూపిస్తున్నారన్న ఆయన.. భవిష్యత్తులో ఇది దేశానికి నష్టదాయకమేనని హెచ్చరించారు. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ న్యూస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు.

రాజన్ కీలక వ్యాఖ్యలు

- *కొందరు రాజకీయ నేతలు దేశం వృద్ధిపథంలో నడుస్తున్నదంటూ ఎక్కువగా చేసి చూపిస్తున్నారు. ఇదంతా అబద్ధం.*
- *ఈ వ్యాఖ్యలను నమ్మితే పెద్ద తప్పు చేసినట్లే. అయితే, దురదృష్టవశాత్తు ఇప్పుడు అదే జరుగుతున్నది.*
- *ప్రస్తుతం కొందరు చెప్తున్న వృద్ధిరేటును నిజంగా సాధించాలంటే ఇంకా ఎన్నో ఏండ్లు మనం తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది.*
- *ఇప్పటికీ దేశంలో చాలామంది చిన్నారులకు హైస్కూల్ విద్య కూడా అందట్లేదు. స్కూల్ డ్రాపౌట్ల సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నది.*
- *అక్షరాస్యతరేటులో మన దేశ స్థానం మరో ఆసియా దేశమైన వియత్నాం కంటే దిగువన ఉన్నది.*
- *ఈ పరిస్థితుల్లో 2047నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడం ఎలా సాధ్యమౌతుంది. ఇదంతా అబద్ధం.*
- *విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయడానికి బదులు.. మోదీ సర్కారు చిప్ తయారీ తదితర రంగాలకు ఎక్కువ ప్రోత్సాహకాలు ఇస్తున్నది. ఇది సరైనది కాదు.*
- *140 కోట్ల జనాభా ఉన్న భారత్‌లో 30 ఏండ్లలోపు యువశ్రామికశక్తి వాటా సగానికి పైగానే ఉంటుంది.*
- *అయితే, వారి విద్య, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు దక్కట్లేదు. ఎప్పుడైతే వారికి తగిన ఉపాధి లభిస్తుందో.. అప్పుడు దేశానికి లాభం చేకూరుతుంది.*
- *అందుబాటులో ఉన్న శ్రామికశక్తిని సరిగ్గా వినియోగించుకొని, కొత్త ఉద్యోగాలు సృష్టిస్తేనే భారత్ వృద్ధిపథంలో దూసుకుపోతుంది.*
- *'పిల్లి నల్లగా ఉన్నదా? తెల్లగా ఉన్నదా? అనేది సమస్య కాదు. అది ఎలుకను వేటాడి పట్టుకుందా? లేదా? అనేది ముఖ్యం' అని చైనా మాజీ అధ్యక్షుడు డేంగ్ జియోపింగ్ చెప్పినట్టు .. ఆచరించదగిన విధానాలు ఉన్నప్పుడు అది చైనా అయినప్పటికీ, దాని నుంచి మనం తప్పకుండా నేర్చుకోవాల్సిందే.*
- *విద్య, ఉద్యోగాల్లో నైపుణ్యాభివృద్ధిని మెరుగుపర్చడం అనేది.. రానున్న ఎన్నికల్లో గెలిచే కొత్త ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నది.*



బలమైన బీమా బ్రాండ్ ఎల్ఐసీ

బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రిపోర్ట్

న్యూఢిల్లీ, మార్చి 26: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) అంతర్జాతీయ మార్కెట్లోనూ సత్తాచాటుతున్నది. ప్రపంచంలో బలమైన బీమా రంగ సంస్థల జాబితాలో తొలి స్థానంలో నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100-2024 పేరిట విడుదలైన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. ప్రస్తుతం ఎల్ఐసీ బ్రాండ్ విలువ 9.8 బిలియన్ డాలర్లు, ఇండెక్స్ స్కోర్ 88.3తోపాటు ఏఏఏ బ్రాండ్ రేటింగ్ ఇచ్చింది. ఆ తర్వాతి స్థానంలో క్యాథీ లైఫ్ ఇన్సూరెన్స్ నిలిచింది. కంపెనీ బ్రాండ్ విలువ 9 శాతం పెరిగి 4.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. అలాగే 1.3 బిలియన్ డాలర్లతో ఎన్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ ఆ తర్వాతి స్థానంలో నిలిచిందని బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. మరోవైపు, చైనాకు చెందిన బీమా బ్రాండ్ నోటబ్లీ బ్రాండ్ విలువ 4 శాతం పెరిగి 33.6 బిలియన్ డాలర్లతో ప్రపంచ బీమా రంగంలో అగ్రగామి సంస్థగా వెలుగొందుతున్నది. ఆ తర్వాతి కూడా చైనా లైఫ్ ఇన్సూరెన్స్ మూడోస్థానంలోను, సీపీఐసీ ఐదో స్థానంలో నిలిచాయని పేర్కొంది. జర్మనీకి చెందిన అలయెంజ్ రెండో స్థానం వరించగా, ఫ్రాన్స్‌కు చెందిన యాక్సా తిరిగి తన నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.39 వేల కోట్లకు చేరుకున్నాయి. అలాగే ఎస్‌బీఐ లైఫ్ రూ.15 వేల కోట్లు రాబట్టగా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.10,970 కోట్లు రాబట్టగలిగింది.

ఎల్ఐసీకి 39 లక్షల జీఎస్టీ నోటీసు

మరోవైపు, ఎల్ఐసీకి రూ.39.39 లక్షల డిమాండ్ నోటీస్ పంపింది జీఎస్టీ కౌన్సిల్. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.19,64,584 జీఎస్టీ డిమాండ్ నోటీసు పంపగా..పెనాల్టీ రూపంలో రూ.19,74,584 చెల్లించాలని ఆదేశించింది.

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్ ● సెన్సెక్స్ 362, నిఫ్టీ 92 పాయింట్లు పతనం

ముంబై, మార్చి 26: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టపోయాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 361.64 పాయింట్లు లేదా 0.50 శాతం పడిపోయి 72,470.30 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 468.91 పాయింట్లు క్షీణించడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 92.05 పాయింట్లు లేదా 0.42 శాతం కోల్పోయి 22,004.70 వద్ద నిలిచింది. దీంతో వరుస మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడినట్టైంది. నిజానికి ఉదయం ఆరంభం నుంచీ సూచీలు నష్టాల్లోనే కదలాడాయి. కాగా, హెవీ వెయిట్ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల్లో అమ్మకాల ఒత్తిడి నష్టాలను పెంచినట్టు మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. రిలయన్స్ షేర్ విలువ 0.88 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.11 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాలవారీగా టెక్నాలజీ, ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల షేర్లు 0.83 శాతం నుంచి 0.26 శాతం మేర దిగజారాయి.

హైదరాబాద్‌లో స్టోరబుల్ కార్యాలయం

హైదరాబాద్, మార్చి 26: అమెరికాకు చెందిన టెక్నాలజీ సొల్యూషన్ సేవల సంస్థ స్టోరబుల్..హైదరాబాద్‌లో కొత్తగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. నాలెడ్జ్ సిటీలో 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో ప్రస్తుతం 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది చివరినాటికి ఈ సంఖ్యను 100కి పెంచుకోనున్నట్లు ప్రకటించింది. ఏడాది క్రితం ఆసియాలో తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన సంస్థ..ఆర్అండ్‌డీని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌కు భారత్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ విభాగాలకు చెందిన సిబ్బందిని నియమించుకోనున్నట్లు ప్రకటించారు.

దేశంలో డాలర్ బిలియనీర్లు 271

2024 హురున్ గ్లోబల్ రిచ్ లీస్ట్ విడుదల

ముంబై, మార్చి 26: గత ఏడాది దేశంలో కొత్తగా 94 మంది డాలర్ బిలియనీర్లు అవతరించారని హురున్ తాజా జాబితాలో తేలింది. అమెరికా తర్వాత ఈ స్థాయిలో మరే దేశంలోనూ పెరగకపోవడం గమనార్హం. దీంతో భారత్‌లో మొత్తం డాలర్ బిలియనీర్ల సంఖ్య 271కి చేరింది. ఈ క్రమంలోనే దేశంలోని బిలియనీర్ల దగ్గరున్న సంపద విలువ లక్ష కోట్ల డాలర్లపైనేనని మంగళవారం విడుదలైన '2024 హురున్ గ్లోబల్ రిచ్ లీస్ట్' స్పష్టం చేసింది. ఇక ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ 231 బిలియన్ డాలర్లతో ఉన్నారు. రెండో స్థానంలో అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ 185 బిలియన్ డాలర్లతో నిలిచారు. భారత్ నుంచి టాప్-10లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ఉన్నారు. 115 బిలియన్ డాలర్లతో 10వ స్థానంలో స్థిరపడ్డారు. అదానీ గ్రూప్ సారథి గౌతమ్ అదానీ 15వ స్థానంలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 3,279 మంది డాలర్ బిలియనీర్లున్నారు.

అంబానీయే టాప్

2023లో ముకేశ్ అంబానీ సంపద విలువ గతంతో పోల్చితే ఏకంగా 40 శాతం ఎగిసింది. 2022తో చూస్తే నిరుడు 33 బిలియన్ డాలర్లు పెరిగి 115 బిలియన్ డాలర్లుగా ఉన్నది. దీంతో దేశంతోపాటు ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా మరోసారి ముకేశ్ రికార్డులకెక్కారు. గౌతమ్ అదానీ సంపద కూడా గత ఏడాది 33 బిలియన్ డాలర్లు పెరిగి 86 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇక దేశంలోని బిలియనీర్లలో ఒక్క ముంబైలోనే 92 మంది ఉన్నారు. దీంతో ఈ విషయంలో చైనా రాజధాని బీజింగ్ వెనుకబడిపోయింది. అక్కడ 91 మందే ఉన్నారు.

దేశంలో రూ. 1,000 కోట్లకుపైగా సంపద ఉన్నవారు 1,319 మంది ఉన్నారు. 1,300 మార్కును దాటడం ఇదే తొలిసారి. 2022తో పోల్చితే 216 మంది పెరిగారు. 2023లోనే తొలిసారి ఈ స్థాయిని అందుకున్నవారు 278 మంది.

భారతీయ బిలియనీర్లలో ఔషధ రంగానికి చెందినవారే అత్యధికంగా 39 మంది ఉన్నారు. ఆ తర్వాత ఆటోమొబైల్, ఆటో కంపోనెంట్స్ రంగానికి చెందినవారు 27 మంది, కెమికల్స్‌కు చెందినవారు 24 మంది ఉన్నారు.

తెలుగువారు వీళ్లే..

పేరు	నికర విలువ (బిలియన్ డాలర్లలో)
మురళీ దివీస్ అండ్ ఫ్యామిలీ	7
పీ పిచ్చిరెడ్డి	6
పీవీ కృష్ణారెడ్డి	6
జూపల్లి రామేశ్వర్ రావు	4
పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి ఫ్యామిలీ	3
బీ పార్థసారథి రెడ్డి అండ్ ఫ్యామిలీ	3
కే సతీష్ రెడ్డి అండ్ ఫ్యామిలీ	2
జీ అమరేందర్ రెడ్డి అండ్ ఫ్యామిలీ	2
ఎం సత్యనారాయణ రెడ్డి ఫ్యామిలీ	2
వెంకటేశ్వర్లు జాస్తి అండ్ ఫ్యామిలీ	2
జీవీ ప్రసాద్ అండ్ ఫ్యామిలీ	1
జీఎస్ రాజు అండ్ ఫ్యామిలీ	1
ఏ అయోధ్య రామి రెడ్డి	1
సీ వెంకటేశ్వర రెడ్డి	1
ఎస్ సుబ్రమణ్య రెడ్డి	1
జగదీష్ ప్రసాద్ అండ్ ఫ్యామిలీ	1
వీసీ నన్నపనేని	1

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.